# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-11-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశ్రామికవేత్తలను కోరారు.
- ❖ పులికాట్ సరస్సును ఫ్లెమింగోల శాశ్వత నివాసంగా తీర్చిదిద్దుతామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.
- ❖ విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో 410 ఒప్పందాలపై సంతకాలు చేయబోతున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.
- ❖ ఎంఎస్ఎంఈ పార్కులలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.

====================

పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశ్రామికవేత్తలను కోరారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించేందుకు లండన్ లో ముఖ్యమంత్రి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా లండన్ లో ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జరాల్డ్ తో ముఖ్యమంత్రి ఈ రోజ సమావేశం అయ్యారు. అమరావతి, విశాఖపట్టణాలలో నూతన సాంకేతికత ద్వారా విద్యుత్ సరఫరా నియంత్రణ రంగంలో పని చేసేందుకు అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ గ్రిడ్, డేటా అనలిటిక్స్ రంగాల్లో రాష్ట్రంలో పని చేసేందుకు అవకాశాలు ఉన్నాయని ఆక్టోపస్ ఎనర్జీ ప్రతినిధులకు చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేలా రాష్ట్రం లక్ష్యం పెట్టుకుందని వివరించారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వ విధానాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వారికి తెలియజేశారు.

====================

ఎకో టూరిజానికి కేంద్రంగా పులికాట్ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ఈ రోజు పోస్ట్ చేశారు. పులికాట్ సరస్సుకు సైబీరియన్ పక్షుల రాక మొదలైందని చెప్పారు. వాటికి శాశ్వత నివాస స్థావరంగా పులికాట్ ను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ మేరకు అటవీ శాఖ

ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎకో టూరిజాన్ని విస్తరించే ప్రక్రియలో భాగంగా ఫోటోగ్రఫీ, బర్డ్ సీయింగ్, ఎకో క్లబ్ పేరిట వివిధ కార్యక్రమాలని నిర్వహిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ తెలిపారు. రానున్న మూడు నెలలు ఫ్లెమింగోల రక్షణపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని అటవీ అధికారులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

====================

విశాఖపట్నం వేదికగా నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో 410 ఒప్పందాలపై సంతకాలు చేయబోతున్నామని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అమరావతిలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహించే సదస్సుకు 300 మంది పారిశ్రామికవేత్తలు హాజరవుతారని చెప్పారు. ఈ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి పలు ప్రాజెక్టులు రాబోతున్నాయన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల చరిత్రలో అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో గూగుల్ సంస్థ డేటా సెంటర్ ని ఏర్పాటు చేయబోతోందని వివరించారు. స్వదేశీ పెట్టుబడుల సాధనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని గుర్తు చేశారు. నెల్లూరులో బీపీసీఎల్ సంస్థ లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతోందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

ఎంఎస్ఎంఈ పార్కులలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎంఎస్ఎంఈ, ఏపీఐఐసి అధికారులతో మంత్రి ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 175 ఎంఎస్ఎంఈ పార్కులలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయాలని సూచించారు. పారిశ్రామిక రంగంలో పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానాల ద్వారా ఎంఎస్ఎంఈల అభివృద్ధిని వేగవంతం చేయాలని, ఇందుకు తగిన కార్యాచరణ, స్పష్టమైన భవిష్యత్ ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని అధికారులకు మంత్రి సూచించారు.

====================

కార్తీక సోమవారం సందర్భంగా రాష్ట్రంలోని పలు శివాలయాలు ఈరోజు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు బారులు తీరారు. విజయవాడ దుర్గా ఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తి శ్రద్ధలతో ప్రమిదలు వెలిగించి, అభిషేకాలు నిర్వహించారు. దీంతో అంతటా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అదే విధంగా రాష్ట్రంలోని పలు ప్రసిద్ధ శైవ క్షేత్రాలలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

విరామం

====================

కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో కాకినాడ జిల్లా పరిధిలోని ప్రముఖ క్షేత్రాల్లో భక్తుల భద్రత, సౌకర్యాల కల్పనపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులకు పుణ్య క్షేత్రాలు, దేవాలయాల్లో ఏర్పాట్లపై పవన్ కళ్యాణ్ ఈ రోజు దిశానిర్దేశం చేశారు. క్యూ లైన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, భద్రతాపరమైన అంశాలపై అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

====================

విశాఖపట్నంలో ఈ నెల 14, 15వ తేదీలలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో టెక్స్ టైల్స్ రంగంలో పలు ఒప్పందాలు చేసుకోబోతున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో తన ఛాంబర్ లో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమీషనర్ రేఖారాణి, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తో మంత్రి ఈ రోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలోని టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన పెట్టుబడిదారులను విశాఖ సదస్సుకు తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

====================

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ నాయకత్వంలోని అధికారుల బృందం దుబాయ్‌లో పర్యటిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా దుబాయ్‌లోని భారత కాన్సులేట్ ప్రతినిధులు బీజీ కృష్ణన్, సెలీనా శశికాంత్ తో మంత్రి నారాయణ బృందం ఈరోజు సమావేశమైంది. రాష్ట్రంలోని అభివృద్ధి గురించి కాన్సులేట్ ప్రతినిధులకు మంత్రి ఈ సందర్భంగా వివరించారు. అదే విధంగా రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో ప్రపంచ ప్రసిద్ధి పొందిన శోభా గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్ దత్తతో మంత్రి సమావేశమై రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల వాతావరణం గురించి వివరించారు.

====================

సీనియర్ సిటిజన్లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ శాఖ ఉప కార్యదర్శి ప్రవేశ్ కుమార్ కోరారు. జీవన ప్రమాణ పత్రాన్ని పెన్షనర్లు అందించేందుకు ప్రభుత్వం అధునాతన పద్ధతులను అమలు చేస్తోందని ఆయన చెప్పారు. సీనియర్ సిటిజన్ల ఇంటి వద్దే జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ యాప్ ను వినియోగించటం తెలియని నిరక్షరాస్యుల కోసం ప్రత్యేక కార్యక్రమాలను పోస్టల్ శాఖ చేపడుతోందని అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ రోజు ఆయన పర్యటించి స్థానిక ఉప తపాలా కార్యాలయంలో ఈ డ్రైవ్ ను సమీక్షించారు.

====================

ఆంధ్రప్రదేశ్ దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాలలో రానున్న 24 గంటలలో తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు. అదే విధంగా ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా ఈనెల 5న చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ మేరకు సంయుక్త కలెక్టర్ ఎం. జాహ్నవితో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగ మేళా గోడ పత్రికను విజయ క్రిష్ణన్ ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ మెగా జాబ్ మేళాకు సుమారుగా 17 బహుళ జాతీయ కంపెనీలు హాజరావుతున్నాయని చెప్పారు.

====================

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా గ్రామీణ, దూర ప్రాంతాల ప్రజలకు హెచ్ ఐ వి, ఎయిడ్స్ వైద్య సేవలందిస్తామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ వెల్లడించారు. అమలాపురం కలెక్టరేట్ లో ఎయిడ్స్

నియంత్రణకు ఐ.సి.టి.సి. సంచార వాహన సేవను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ వాహనం ఇంటింటికి వెళ్లి కౌన్సెలింగ్, టెస్టింగ్ అవగాహన కార్యక్రమాలను అందించనుందని తెలిపారు.

=====================

=====================